# సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 13 । జూన్ । 2024






**సేంద్రియ మందు.. లాభాలు మెండు**
జిల్లాలో పడమటి మండలాల రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన జీవనాధారమైన పంట టమాటా రోగాలతో పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిని నాశనమవుతున్నాయి. - 8లో



**ఊరిని కమ్మేసిన మహమ్మారి!**
కురబలకోట మండలం చింతమాకులపల్లె గ్రామ పరిధిలో మారుమూల ప్రాంతంలో ఉన్న పులుసుగుంతల గ్రామంలో అంతుబట్టని వ్యాధితో ప్రజలు అల్లాడుతున్నారు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.500 | రూ.620 |
| రెండోరకం | రూ.360 | రూ.480 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 727 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### 15న మెకానిక్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కడప రూరల్ : అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ 108, 104, 102 వాహనాలకు సంబంధించి మెకానిక్ పోస్టులకు ఈనెల 15న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మేనేజర్ సురేంద్రకుమార్ తెలిపారు. ఈ పోస్టులకు ఫోర్స్, మారుతి ఈసీఓ బీఎస్–ఐఐఐ, బీఎస్–వీఐ, వాహనాలకు సంబంధించి అనుభవజ్ఞులై ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేన కడప న్యూ రిమ్స్‌లోని కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు బయోడేటా ఫామ్‌తో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబరు 8008160568 ను సంప్రదించాలని తెలిపారు.

### 28 నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ పోస్టు గ్రాడ్యుయేషన్ 2, 4వ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. 2వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 28న, జూలై 1, 3,4,8,10 తేదీలలో ఉంటాయన్నారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29, జూలై 2,4,6,9,11 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పైన తెలిపిన తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంబంధిత శాఖలో హాల్‌టికెట్లు పొంది పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

### 15న శ్రీశ్రీపై కవితల పోటీ

కడప కల్చరల్ : ప్రముఖ కవి శ్రీశ్రీగా విశేష గుర్తింపు సాధించిన శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 15న కవితల పోటీ నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి సామాజిక సాహిత్య సేవా సంస్థ జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లా కుమారస్వామి తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే వారందరికీ బహుమతులు అందజేస్తామని, కడప నగరంలోని ఆసక్తిగల యువతీ యువకులు ఈ పోటీలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ పోటీ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్యం, సామాజిక సమకాలీనత అనే అంశంపై కవితలు రాయాలని కోరారు. ఈ పోటీకి సంబంధించిన పూర్తి వివరాల కోసం లెనిన్ ప్రసాద్ 94906 60424. కుమారస్వామి 94901 22229 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు




కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచలగిరి ప్రదక్షిణ కోసం తిరువణ్ణామలైకి ఈనెల 20, 21 తేదీలలో వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20వ తేది కడప డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా తిరువన్నామలైకి బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో రూ. 1072గా ఛార్జి నిర్ణయించారన్నారు.

- బద్వేలు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరొక బస్సు అదే సమయంలో పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసులో రూ. 1566, సూపర్ లగ్జరీలో రూ. 1475గాఛార్జి ఉంటుందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి ఉదయం 9 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌మీదుగా సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేవామన్నారు. ఇందులో రూ. 1130 చార్జీగా నిర్ణయించారన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు బయలుదేరే బస్సు కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1273గా చార్జీ ఉంటుందన్నారు.
- జమ్మలమడుగు నుంచి సాయంత్రం 5.00 గంటలకు బస్సు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బయలుదేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ. 1352గా ఉందన్నారు. మరో బస్సు 21వ తేది ఉదయం 5.30 గంటలకు ప్రొద్దుటూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో ఛార్జీ రూ. 1352గా ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు. ఇందులో రూ. 1242 టిక్కెట్ ధరగా నిర్ణయించారన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# సెలవులకు టాటా.. ఇక బడి బాట

ఆటలను అటకెక్కించి.. అక్షరాలతో దోస్తీ కట్టాల్సిన సమయం వచ్చేసింది. సెలవులకు స్వస్తి పలికి.. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. 'ఆడింది చాల్లే.. ఇక భుజాన బ్యాగుతో బడిబాట పట్టవోయ్..' అంటూ పాఠశాల ప్రేమగా పిలుస్తోంది. వడివడిగా రమ్మంటూ.. గణగణమంటూ గంట మోగిస్తూ పిలుస్తోంది. వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.

- నేటి నుంచి పునః ప్రారంభం కానున్న పాఠశాలలు
- బడిబాట పట్టనున్న విద్యార్థులు



రాయచోటి/మదనపల్లె సిటీ: వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇన్నాళ్లు ఆటపాటలతో మునిగి తేలిన చిన్నారులు ఇకపై బడిబాట పట్టనున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు సర్వం సిద్ధం చేశారు. నిజానికి 12వ తేదీ బుధవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకోవాల్సి ఉంది. కానీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పాఠశాలలను ఒక రోజు ఆలస్యంగా 13వ తేదీ నుంచి పునః ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే.

**జిల్లాలో 2845 విద్యాసంస్థలు...**

వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారుల లెక్క ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2845 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,32,224 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్న, ఉన్నత పాఠశాలలోపాటు కేజీబీవీ, ఏపీ మెడల్ స్కూల్స్, ఏపీ రెసిడెన్సియల్, ఏపీ ట్రైబర్ వేల్ఫేర్, బీసీ వెల్ఫేర్ల పేరుతో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలు 1997 వరకు ఉన్నాయి, వీటిల్లో సుమారు 1,41.199 మంది విద్యార్థులు కొనసాగుతున్నారు. అలాగే ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలుసుకుని 755 పనిచేస్తున్నాయి, వీటిల్లో సుమారు 7787 మందివిద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యాసంస్థలన్నీ గురువారం నుంచి నూతన్య విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనున్నాయి.

**తొలిరోజు నుంచే గోరుముద్ద..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నూతనంగా పీఎం పోషణ్ గోరుముద్ద పథకాన్ని అమలు చేయనున్నారు. పాఠశాలలు తెరిచే తొలి రోజు నుంచే గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. వారంలో ఐదు రోజులపాటు విద్యార్థులకు అందించనున్న కొడిగుడ్ల సరఫరాకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతోపాటు ఇటీవలే ప్రముఖ చెఫ్‌లతో పాఠశాలల్లో వంట కార్మికలకు శిక్షణ కూడా ఇచ్చారు. దీంతోపాటు ఇక బెల్లం చిక్కీలను కూడా ప్రతి 15 రోజులకు ఒక సారి పాఠశాలలకు అందించాలని,బడులు తెరిచే నాటికి మధ్యాహ్నం కోసం అవసరమైన బియ్యం, రాగిపిండి, పాడిబెల్లం సిద్ధం చేయాలని కూడా ఆదేశాలను జారీ చేసింది.

**మారిన పరిస్థితులు**

జిల్లాలో నాడు– నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయి. ఒకప్పుడు ఇరుకిరుకు తరగతి గదులు, కనీస సౌకర్యాలు లేని మరుగుదొడ్లు, తాగునీటికి ఇక్కట్లు, నేలపైన కూర్చొవటం వంటి పరిస్థితులు ఉండేవి. కానీ వైఎస్ జగన్ పరిపాలనలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు పూర్తిగా మారాయి. కార్పోరేటుకు దీటుగా వసతులను సమకూర్చారు. వైఎస్సార్‌జిల్లాలో మొదటి విడతలో రూ. 275 కోట్లతో 1040 పాఠశాలల్లో నాడు– నేడు పనులు పూర్తయ్యాయి. ఇక రెండవ విడతలో 298 కోట్లతో 1016 స్కూళ్లలో పనులు కొనసాగుతున్నాయి.

**అన్నమయ్య జిల్లాలో పాఠశాలల వివరాలు**

జిల్లాలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు నేటి నుంచి తెరుచుకోనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2757 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 2,47,870 మంది విద్యార్థులు 48 రోజుల సుదీర్ఘ సెలవుల తరువాత బడిబాట పట్టనున్నారు. ఇందుకోసం పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేసి పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పాఠశాలల ఉపాధ్యాయులు సన్నాహాలు చేస్తున్నారు.



పిల్లల కోసం సిద్ధం చేసిన డెస్కులు

**సర్వం సిద్ధం**

పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాం. పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్‌లను పాఠశాలలకు పంపాము. త్వరితగతిన వాటిని విద్యార్థులకు అందిస్తాం.

– శివప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

**యథావిధిగా పనివేళలు..**

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండంతోపాటు వాతావరణం కూడా చల్లబడింది. దీంతో ఎండల తీవ్రత బాగా తగ్గింది. దీంతో పాఠశాల పనివేళలు యథావిధిగా ఉంటాయని అధికారులు తెలిపారు.

### విద్యా కానుక సిద్ధం



కడప ఎడ్యుకేషన్ : పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక ఇవ్వడానికి అధికారులు సిద్ధమయ్యారు. పూర్తిస్థాయిలో కాకున్నా ఇప్పటివరకు వచ్చిన వాటిని విద్యార్థులకు అందివ్వడానికి సమాయత్తమవుతున్నారు. జిల్లాలో వివిధ యాజమాన్యాలకు సంబంధించి 1633 ప్రాథమిక పాఠశాలలు, 136 ప్రాథమికోన్నత పాఠశాలలు, 307 ఉన్నత పాఠశాలల ఉండగా వీటన్నింటిలో 1,42,780 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి విద్యాకానుక కిట్లను అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు నోట్‌బుక్సు, బెల్ట్స్ మాత్రమే వందశాతం వచ్చాయి. మిగతా బ్యాగులు 75 శాతం, పాఠ్యపుస్తకాలు 69.69 శాతం, వర్కుబుక్స్ 64.86 శాతం వచ్చాయి. ఇక బూట్లు, సాక్సులు, యూనిఫాం క్లాత్, పిక్టోరియల్, ఆక్స్‌పర్డ్ డిక్షనరీలు రావాల్సి ఉంది.

**విద్యాకానుక కిట్‌లో సమాగ్రి ఇలా...**

ప్రభుత్వం పిల్లలకు అందించే విద్యాకానుక కిట్టులో మూడు జతల యూనిఫాం, స్కూల్‌బాగ్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్ట్, ఒక సెట్ నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, వర్కుబుక్కులు, డిక్షనరీలు కలిసి ఉండనున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం విద్యాకానుక కిట్ పేరును స్టూడెంట్ కిట్టుగా మార్చింది.

**అన్నమయ్య జిల్లాలో..**

మదనపల్లి సిటీ : అన్నమయ్య జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,709, ప్రాథమికోన్నత 214, ఉన్నత పాఠశాలలు 296 ఉన్నాయి. వీటిలో సుమారు 1,54,789 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి విద్యాకానుక కిట్లు అందజేయనున్నారు.

# సత్య.. ఇక అమాత్య!

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరువాసి సత్యకుమార్ యాదవ్ ఆదినుంచి ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలో చురుగ్గా ఉన్నారు. టెన్త్ వరకు ప్రొద్దుటూరులోనే చదివిన ఆయన పాలిటెక్నిక్ విద్యనభ్యసించేందుకు అప్పటి చిత్తూరు జిల్లా మదనపల్లికి వెళ్లారు. అక్కడ ఏబీవీపీ నాయకుడిగా ఉన్నారు. అక్కడి బీజేపీ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డితో ఉన్న చనువు కారణంగా ఆయన ద్వారా అప్పటి బీజేపీ జాతీయ నాయకుడు వెంకయ్య నాయుడుకు చేరువయ్యారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేసిన కాలంలో వ్యక్తిగత సహాయకుడిగా, ఓఎస్డీగా సేవలందించారు. అప్పటి నుంచి కేంద్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. వెంకయ్యనాయుడుకు ఉప రాష్ట్రపతి పదవి దక్కడంతో సత్యకుమార్‌ను పార్టీ అధిష్టానం బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమించింది. కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా తదితర నేతలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే స్థానికేతరుడైనప్పటికీ సత్యసాయిజిల్లా ధర్మవరం నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున పోటీ చేశారు. ఈయన ఎన్నికల ప్రచార సభకు అమిత్‌షా సైతం హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఢిల్లీ పెద్దల ఆశీస్సులతో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. సత్యగా పిలుచుకునే ఆయన అభిమానులు, సన్నిహితులు ఆయనకు మంత్రి పదవి లభించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా పోటీచేసిన తొలిసారే విజయం సాధించడం, పైగా మంత్రివర్గంలో చోటు సంపాదించడంతో డబుల్ ధమాకా సాధించినట్లయింది.



| | |
|---|---|
| పేరు | : సత్యకుమార్ యాదవ్, |
| విద్యార్హత | : పీజీ, |
| జననం | : 16-09-1971 |
| తండ్రి | : దివంగత నాగరాజ, |
| తల్లి | : దివంగత నాగూబాయి |
| సోదరుడు | : దివంగత నాగరాజు, |
| వదిన | : దివంగత రత్నాబాయి, |
| మరో సోదరుడు: | శివకుమార్ యాదవ్, |
| వదిన | : అనురాధ |
| అక్క | : దివంగత సోని, |
| బావ | : గోకుల్ |
| సతీమణి | : త్రివేణి |
| సంతానం | : 1. సంస్కృతి, 2. రిషి అద్వానీ |

**సీనియర్లకు లభించని అవకాశం**

ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా గెలిచి రాజకీయంగా విశేషానుభవం ఉన్న ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిలకు చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం లభించలేదు. బీజేపీకి లభించే ఛాన్సును చేజిక్కించుకునేందుకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది విశేషంగా ప్రయత్నించారు. కాగా బీజేపీ అధిష్టానం మొదటి నుంచి బీజేపీలో ఉన్న వారికే అవకాశం కల్పించాలనే నిర్ణయానికి రావడంతో ఆదికి మంత్రి పదవి చేజారినట్లు పలువురు వివరిస్తున్నారు. రాజకీయాల్లో సీనియర్‌గా 6సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన చరిత్ర జిల్లాలో నంద్యాల వరదరాజులరెడ్డికి ఉంది. ఈమారు మంత్రి పదవి దక్కుతుందని అందరూ భావించారు. ఆమేరకు భారీగా ప్రయత్నాలు చేశారు. పొరుగు రాష్ట్రానికి చెందిన ముఖ్యనేత ద్వారా విశేషంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

**మాధవీరెడ్డికి నిరాశ ..** కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మంత్రి పదవి కోసం విశేషంగా ప్రయత్నించారు. టీడీపీ తరపున 20 ఏళ్లుగా కడప ఎమ్మెల్యేగా ఎవరూ గెలుపొందని నేపథ్యంలో టికెట్ దక్కించుకున్న తొలిసారే విజయం సాధించారీమె. దీంతో మహిళ కోటాలో అయినా మంత్రియోగం కల్పించాలని అభ్యర్థించారు. తుదివరకూ మాధవీరెడ్డి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఒక దశలో చంద్రబాబు ఆమె వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మరోవైపు లోకేష్ రాజకీయ సమీకరణల నేపథ్యంలో రామ్‌ప్రసాద్‌రెడ్డికి అవకాశం కల్పించా ల్సిందిగా పట్టుబట్టినట్లు సమాచారం. పైగా జిల్లాలోని ముఖ్యనేతలు శ్రీనివాసుల రెడ్డి కుటుంబానికి మంత్రి పదవి కేటాయించడాన్ని సమర్థించలేదని సమాచారం. ఫలితంగా ఆమెకు మంత్రియోగం చేజారినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

# పిల్లల హక్కులు కాలరాయొద్దు

రాయచోటి టౌన్ : బడి ఈడు పిల్లల బడిలో ఉండాలని వారి హక్కులు కాలరాయకూడదని అన్నమయ్య జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి శశికళ అన్నారు. బుధవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అందుకోసం బాలల పరిరక్షణ విభాగం ఏర్పడిందని చెప్పారు. బాల కార్మికులు ఎక్కడ కనబడినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. జూన్ 1 నుంచి 30వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డీఈఓ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వారిని ఎవరూ పనిలో పెట్టుకోకూడదని హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి లేబర్ శాఖ అధికారి రంగరాజు పాల్గొన్నారు.

# మినిష్టర్ రాముడు

- రాయచోటి ఎమ్మెల్యే రామ్‌ప్రసాద్ రెడ్డిని వరించిన మంత్రి పదవి
- ఎమ్మెల్యే కావాలన్న ఇరవై ఏళ్ల చిరకాలవాంఛ నెరవేరిన సమయం
- పైగా మంత్రి హోదా దక్కడంతో డబుల్ ధమాకా
- నియోజకవర్గానికి తొలిసారి దక్కిన మంత్రి పదవి
- కడప, రాజంపేట, తిరుపతి, చిత్తూరు లోకసభ స్థానాల పరిధిలో ఏకైక మంత్రి



సతీమణి హరితారెడ్డితో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

| | |
|---|---|
| పేరు | : మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి |
| విద్యార్హత | : బీడీఎస్ (డిస్‌కంటిన్యూ) |
| జననం | : 19-03-1980 |
| తండ్రి | : మండిపల్లి నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే (1985-89, 1989-91) |
| తల్లి | : మండిపల్లి సుశీలమ్మ, మాజీ ఎంపీపీ |
| కవల సోదరుడు | : డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి (బెంగళూరులో స్థిరపడ్డారు) |
| వదిన | : సౌమ్యరెడ్డి |
| అక్క | : మిన్నంరెడ్డి శ్రీలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి |
| చెల్లెలు | : శ్రీవిద్య |
| సతీమణి | : హరితారెడ్డి |
| సంతానం | : 1. నిశ్చల్ నాగిరెడ్డి 2. నాగ వైష్ణవిరెడ్డి |

సాక్షి ప్రతినిధి, కడప : ఆయన ఎమ్మెల్యే కావాలన్న చిరకాలవాంఛ తీరింది. ఇరువై ఏళ్లగా నిరీక్షణకు ఫలితం దక్కింది. ఆపై ఏకంగా మంత్రి హోదా వరించడంతో డబుల్ ధమాకా వచ్చినట్లయింది. వెరసి ఇప్పటివరకు రాయచోటి నియోజకవర్గ చరిత్రలో మంత్రి పదవి దక్కించుకున్న తొలి ఎమ్మెల్యే అయ్యాడు. దీంతో ఇప్పటివరకు 'రాముడూ'అంటూ ఆయనను ముద్దుపేరుతో పిలిచేవారంతా ఇకపై 'మినిష్టర్ రాముడు' అని సంబోధిస్తున్నారు.


**రాజకీయ నేపథ్యం**

రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలానికి చెందిన మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా 1991లో రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. దీంతో 1992లో జరిగిన ఉప ఎన్నికల్లో నాగిరెడ్డి సోదరుడి కుమారుడైన నారాయణరెడ్డి కాంగ్రెస్ తరపున పోటీచేసి గెలుపొందారు. తర్వాత 1994లో మళ్లీ గెలిచి 1999 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన తల్లి సుశీలమ్మ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. అక్క మిన్నంరెడ్డి శ్రీలతారెడ్డి 2004లో ఎమ్మెల్యేగా పోటీచేసి 3600 ఓట్ల స్వల్పతేడాతో ఓడిపోయారు.

**ఎమ్మెల్యే టికెట్ ఖరారయ్యాక..**

మండిపల్లి ప్రసాద్‌రెడ్డికి 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున రాయచోటి ఎమ్మెల్యే టికెట్ అనధికారికంగా ఖరారయ్యింది. అప్పట్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభయం దక్కింది. తీరా చూస్తే అప్పటికి ఎమ్మెల్యే అభ్యర్థికి ఉండాల్సిన కనీస వయస్సు రామ్‌ప్రసాద్‌రెడ్డికి లేదు. దీంతో ఆయన సోదరి శ్రీలతారెడ్డికి ఎమ్మెల్యే టికెట్ దక్కింది. ఆమె స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత 2009 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో 2012 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2014లో సమైక్యాంధ్ర (మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి పార్టీ) తరపున పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో మరోమారు ప్రధాన పార్టీల టికెట్ ఆశించి భంగపడ్డారు. చివరికి 2024లో ఎన్‌డీఏ కూటమి తరపున టీడీపీ అభ్యర్థిత్వం అనూహ్యంగా మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి దక్కింది. 2004లో లభించాల్సిన కాంగ్రెస్ పార్టీ టికెట్ మిస్ కావడం, ఇరవై ఏళ్ల తర్వాత టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**ఎమ్మెల్యే, మంత్రిగా డబుల్ ధమాకా**




రాయచోటి ఎమ్మెల్యేగా పోటీ చేసిన రామ్‌ప్రసాద్ రెడ్డికి మరోమారు ఓటమి తప్పదని విశ్లేషకులు అంచనావేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించి, విశేష అభివృద్ధి చేపట్టడం, ముస్లిం మైనార్టీ ఓటర్లు గణనీయంగా ఉండటంతో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థికి ఓటమి తప్పదని భావించారు. అనూహ్యంగా అక్కడి నుంచి స్వల్ప మెజార్టీ 2,485 ఓట్ల ఆధిక్యతతో టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపొందారు. 2004 నుంచి ఎమ్మెల్యేగిరి ఆశిస్తూ వచ్చిన ఆయనకు 2024లో కోరిక నెరవేరింది. రాముడు ఎమ్మెల్యే అయ్యారని ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, అంతలోనే అనూహ్యంగా మంత్రి పదవి వరించింది. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

**18వ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

రాయచోటి : మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి రాష్ట్ర క్యాబినేట్‌లో చోటు దక్కడం రాయచోటి రాజకీయ చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచింది. ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలవడం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినేట్‌లో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రాయచోటి వాసుల కల నెరవేరినట్లైంది. రాయచోటి అసెంబ్లీ స్థానికి 18వ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. కాగా రాయచోటి నియోజకవర్గంలో 2004 నుంచి ఎమ్మెల్యే కావాలన్న కోరికతో రాంప్రసాద్ రెడ్డి 20 సంవత్సరాల పాటు నిరంతర రాజకీయ పోరాటం చేశారు. నేరుగా మంత్రి హోదాలో శాసనసభలో అడుగు పెట్టడం ఆయన కష్టానికి, పోరాటానికి దక్కిన అదృష్టఫలం.

**రాయచోటికి తొలిసారి మంత్రిపదవి**

రాయచోటి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రియోగం దక్కింది. ఇప్పటి వరకూ మహామహులు ఎమ్మెల్యేలుగా కొనసాగినా, వారికి అలాంటి అదృష్టం పట్టలేదు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రామ్‌ప్రసాద్‌రెడ్డికి (42) పిన్నవయస్సులోనే ఈ అవకాశం లభించింది. వై.ఆదినారాయణరెడ్డి, హబీబుల్లా, మండిపల్లి నాగిరెడ్డి, పాలకొండ్రాయుడు, మండిపల్లి నారాయణరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డిలాంటి నాయకులు పలు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా వారెవ్వరికి లభించని అవకాశం రామ్‌ప్రసాద్‌రెడ్డికి దక్కింది. కాగా ప్రస్తుత మంత్రివర్గంలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా మినహాయిస్తే రాజంపేట, కడప, చిత్తూరు, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఏకైక మంత్రిగా రామ్‌ప్రసాద్‌రెడ్డి ఉండటం విశేషం.

## క్లుప్తంగా

### వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన గంగులప్ప కుమారుడు డి.రవి(40) కుటుంబ సమస్యలతో మంగళవారం రాత్రి గొంతుకోసుకున్నాడు. అదేవిధంగా మండలంలోని కోళ్లబైలుకు చెందిన కె.అమర(38) భార్యతో గొడవపడి మనస్తాపం చెంది బుధవారం ఇంట్లోనే పురుగుమందు తాగాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం చారాల పంచాయతీ మీర్జేపల్లెకు చెందిన దంపతులు పి.లోకేష్(32), సుమతి(26) కుటుంబ సమస్యలతో గొడవపడ్డారు. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### యువకుడి ఆత్మహత్య

చెన్నూరు : చెన్నూరు బ్రాహ్మణ వీధికి చెందిన సాదు మహేష్ (22) మద్యానికి బానిసై తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాదు శేఖర్ కుమారుడు వృత్తి రీత్యా మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతని తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరిగా ఉంటూ మనస్తాపంతో మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బుధవారం ఉదయం 10 గంటల సమయంలో మహేష్ ఇంటి నుంచి కుళ్లిన వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి విచారించారు. అతను సుమారు మూడు రోజుల క్రితం చనిపోయినట్లు గుర్తించారు. వైద్యుడిని పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

కడప అగ్రికల్చర్ : ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయంలో అందజేసినట్లు ఆమె తెలిపారు. అలాగే కడప డీసీ బ్యాంకు చైర్‌పర్సన్ పదవికి కూడా ఈనెల 13వ తేదీ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన పదవీ కాలంలో బ్యాంకు అభివృద్ధికి సహకరించిన డైరెక్టర్లతోపాటు అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# సేంద్రియ మందు.. లాభాలు మెండు

- ఆకులు, ఆవు మూత్రంతో మందు తయారీ
- సత్ఫలితాలు ఇస్తున్న కొత్త మందు ప్రయోగం
- చీడపీడలు లేని టమాటా తోటలు



సేంద్రియ ఎరువు వినియోగంతో చీడపీడలు లేకుండా ఆరోగ్యకరంగా ఉన్న టమాటా తోటలు

గుర్రంకొండ : జిల్లాలో పడమటి మండలాల రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన జీవనాధారమైన పంట టమాటా. టమాటా సాగులో పలు దశల్లో వ్యాపించే వైరస్, ఇతర రోగాలతో పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిని నాశనమవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలను పంట సాగు కోసం ఖర్చుచేసి రైతులు నష్టపోతున్నారు. కొన్ని రకాల రోగాలు, వైరస్‌లు సోకి ఎన్ని రకాల రసాయనిక ఎరువులు వాడినా టమాటా తోటల్లో ఫలితముండదు. ఇలాంటి చీడపీడల నివారణ కోసం సహజసిద్ధమైన పొలాల వద్ద లభించే ఆకులతో కొత్తరకం సేంద్రియ మందును రైతులు కనిపెట్టారు. ఇవి ఎంతో సత్ఫలితాలను ఇస్తున్నాయి. టమాటా తోటల పెంపకంలో అతి భయంకరమైన ఊజి, దోమ, ఆకుమడత రోగాల నివారణ కోసం సహజసిద్ధమైన సేంద్రియ పద్ధతిలో కొత్తరకం మందు తయారుచేసే విధానాన్ని కనుగొన్నారు. పొలాల వద్ద లభించే రెండురకాల ఆకులను, ఆవు మూత్రంతో కలిపి మందును తయారు చేశారు. ఈ మందును టమాటా తోటల్లో పిచికారీ చేయడం వలన ఊజి, దోమ లాంటి వైరస్‌లు చాలా వరకు అదుపులోకి వస్తున్నాయి. కొంతమంది రైతులు సొంతంగా తాము సాగు చేస్తున్న టమాటా తోటల్లో వీటిని వినియోగిస్తుండడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

**మందు తయారీ విధానం**


సీతాఫలం ఆకు, వేపాకులను తగినంత ఆవు మూత్రంతో కలపాలి. మూడింటిని ఒక డ్రమ్ములో వాటికి సరిపోయే విధంగా నీటిని పోసి మురగబెట్టాలి. వారం రోజుల నుంచి పది రోజుల వరకు డ్రమ్ముకు పైన మూత ఉంచి బాగా మురగబెట్టాలి. ఆ తరువాత లీటర్ల ప్రకారం కొలిచి తీసి తగిన విధంగా వాడుకోవచ్చు.

**ఎకరా పొలంలో మందు వాడే విధానం**

ఒక ఎకరాకు నాలుగు లీటర్ల చొప్పున వాడుకోవాల్సి ఉంటుంది. ఒక డ్రమ్ము నీటిలో రెండు లీటర్ల చొప్పున మందును కలపాలి. అలా రెండు డ్రమ్ముల నీటిలో మొత్తం నాలుగు లీటర్ల మందును కలిపి టమాటా తోటలపై స్ప్రే(పిచికారీ) చేయాల్సి ఉంటుంది. లేదా సాధారణంగా రోగాల నివారణకు రైతులు వినియోగించే రసాయనిక మందుల్లో కూడా సగం మోతాదులో ఈ రకం మందును కలిపి కూడా పంటలపై పిచికారీ చేసుకోవచ్చు.

**ఈ రకం రోగాలపై ప్రభావం**

ఈ రకం మందును పంటలపై పిచికారీ చేయడం వలన టమాటా పంటలను ఆశించే పలు రకాల రోగాలకు కారణమైన వైరస్, ఇతర క్రిమి కీటకాలపై మంచి ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా ఊజి రోగం, బూడిద రోగం, కాయతొలుచు పురుగు, లద్దెపురుగు, దోమ, ఆకుముడత రోగానికి బాగా పనిచేస్తుంది. మందును పంటలపై పిచికారీ చేసిన నాలుగు రోజుల నుంచి ఐదు రోజుల లోపు ఫలితం కనిపిస్తుంది.



వేపాకు, సీతాఫలం ఆకు ఆవు మూత్రం కలిపి డ్రమ్ములో మురగబెట్టిన దృశ్యం

**మందు వినియోగంతో ప్రయోజనాలు**

దోమ నివారణ జరిగితే తోటల్లో చెట్టు చిగుళ్లు బాగా నిలిచి పూత బాగా పట్టి తద్వారా కాయలు ఎక్కువగా కాస్తాయి. కాయతొలుచు పురుగు నశిస్తే టమాటాల్లో రంధ్రాలు పడకుండా నాణ్యతగా ఉంటాయి. ఆకుముడత రోగం నశిస్తే చెట్టు ఆకులు, కొమ్మలు ఏపుగా పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. లద్దెపురుగు, ఊజి రోగాల ద్వారా దెబ్బతినే టమాటాలను ఎక్కువగా రంధ్రాలు పడనీయకుండా కాపాడుకోవచ్చు. టామటాలు చీటికిమాటికి రోగాల బారిన పడనీయకుండా ఆరోగ్యకరమైన వాతావరణంలో పంట దిగుబడి సాధించవచ్చు.

**మూడేళ్లుగా వినియోగిస్తున్నాను**



సహజ సిద్ధమైన ఆకులు, ఆవుమూత్రంతో తయారు చేసిన మందును నేను మూడేళ్లుగా వినియోగిస్తున్నాను. ప్రస్తుతం ఒకటిన్న ఎకరం పొలంలో టమాటా పంట సాగు చేశాను. ప్రస్తుతం కాయలు కోత దశలోఉన్నాయి. చాలావరకు అన్ని రోగాల నివారణకు ఇదే మందును వినియోగిస్తున్నారు. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. 70 శాతానికి పైగా రసాయనిక ఎరువుల ఖర్చు భారం తగ్గింది. టమాటా తోట కూడా ఎంతో ఆరోగ్యకరంగా ఉంది. ఈ రకం మందును ఈ ఏడాది కొత్తగా మామిడి తోటలపై కూడా ప్రయోగించాను. మామిడి తోటల్లో సాధారణంగా వినియోగించే రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ మందు పిచికారీ చేశాను. రెండెకరాల మామిడి తోటలో ఎలాంటి రోగాలు వ్యాపించలేదు. పలు రకాల పంటలపై ఈ రకం మందు ప్రభావితం చూపిస్తూ మంచి ఫలితాలు ఇస్తోంది. ఈ రకం మందు తయారీకి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా పొలాల వద్ద ఉచితంగా తయారు చేసుకోవచ్చు.

\- నారాయణ, రైతు, మొరంపల్లె

**మంచి ఫలితాలు ఇస్తాయి**



టమాటాలో ఊజీ, దోమ, ఆకుముడత రోగాల నివారణ కోసం రైతులు సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకొంటున్న మందులు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఎంతో మంది రైతులు టమాటా, మామిడితోటల్లో చీడ పీడల నివారణ కోసం వేలాది రూపాయలు ఖర్చుచేసి రసాయనిక ఎరువులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. అయితే సేంద్రియ పద్ధతిలో ఎలాంటి డబ్బులు ఖర్చు పెట్టకుండా రైతులు సీతాఫలం ఆకు, వేపాకు, ఆవు మూత్రంతో తయారు చేసే పురుగు నివారణ మందులు కూడా మంచి ఫలితాలనే ఇస్తున్నాయి. ఇటీవల చాలా గ్రామాల్లో రైతులు ఈ మందులను తోటల వద్దనే తయారు చేసుకొని వాటిని వినియోగిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు.

\- నవీన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, గుర్రంకొండ

## రైతుల ఫిర్యాదుపై లోకాయుక్త విచారణ



రైతుల ఇళ్లను పరిశీలించేందుకు వెళుతున్న లోకాయుక్త అధికారులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రభావంతో పరిసర ప్రాంతాల పొలాలు, ఇళ్లు నాశనం అవుతున్నాయని బాధిత రైతుల ఫిర్యాదుపై ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త స్పందించింది. ఈ మేరకు లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి బుధవారం మైలవరం మండలంలోని నవాబుపేట, దుగ్గనపల్లె, దాల్మియా కర్మాగారం పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత రైతులు, ప్రజలు అధికారుల ఎదుట తమ సమస్యలు ఏకరువు పెట్టారు. దాల్మియా ప్రహరీ వల్ల నవాబుపేట గ్రామ పొలాల్లో వర్షం వచ్చినప్పుడు భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని, తద్వారా పంట పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. అలాగే మైనింగ్‌లో జరుగుతున్న బ్లాస్టింగ్ వల్ల గ్రామాల్లోని ఇళ్లు నెర్రెలు చీలుతున్నాయన్నారు. కాలుష్యం కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి రావడం లేదని బాధితులు అధికారుల దృష్టికి తెచ్చారు. బాధిత రైతుల సమస్యలను పూర్తిగా విన్న డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యలపై నివేదికను డైరెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, నీటి పారుదల శాఖ ఈఈ, జిల్లా మైనింగ్ అధికారులు, కాలుష్య నియంత్రణ అధికారులు, వ్యవసాయ శాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

## ఊరిని కమ్మేసిన మహమ్మారి!



పులుసుగుంతల గ్రామంలో పరిస్థితిని సమీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య



పులుసుగుంతలలో వైద్య చికిత్స నిర్వహిస్తున్న వైద్యాధికారులు

- విరేచనాలు, వాంతులతో భయాందోళన
- అంతుచిక్కని వ్యాధితో ఊరంతా బిక్కుబిక్కు
- ఒకరి మృతి
- ఐదుగురికి తీవ్ర అస్వస్థత
- రాత్రింబవళ్లు ఊరిలో వైద్య శిబిరం

కురబలకోట : కురబలకోట మండలం చింతమాకులపల్లె గ్రామ పరిధిలో మారుమూల ప్రాంతంలో ఉన్న పులుసుగుంతల గ్రామంలో అంతుబట్టని వ్యాధితో ప్రజలు అల్లాడుతున్నారు. శివమ్మ (65) అనే మహిళ మృతి చెందింది. 22 గృహాలున్న ఆ ఊరిలో 110 మంది దాకా జనాభా ఉన్నారు. ఊరంతా వ్యాధి వ్యాపించి 25 మంది దాకా అస్వస్థతకు గురయ్యారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా మారింది. నర్సమ్మ, సి. వెంకటరమణారెడ్డి, శాంతమ్మ తదితరులు తిరుపతి రుయా, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాగునీటి కలుషితం వల్ల జరిగిందా..లేదా కలుషిత ఆహారం వల్ల ఇలా జరిగిందా..ఏమిటన్నది అంతుబట్టడం లేదని చెబుతున్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కొండయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉన్నట్లు వారు తెలిపారు. ఊరంతా ఉన్నట్టుండి ఎక్కువగా తొలుత విరేచనాలు కావడం తర్వాత వెంటనే మరికొందరికి వాంతులు అయ్యాయి. ఎందుకు ఇలా జరిగిందన్నది అంతుబట్టక గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. వైద్య బృందాలు హుటాహుటిన గ్రామానికి వెళ్లి యుద్ధ ప్రాతిపదికన వైద్య చికిత్స ప్రారంభించారు. రాత్రింబవళ్లు వైద్య బృందాలు సేవలు అందిస్తున్నాయి. గ్రామ సర్పంచ్ కోళ్ల విమలమ్మ, ఆ గ్రామ నాయకులు కోళ్ల వాసుదేవరెడ్డి మురుగునీటి కాలువలు, పరిసరాలను శుభ్రం చేయించారు. వాటర్ ట్యాంకు, తాగునీటిని క్లోరినేషన్ చేశారు. ప్రత్యేకంగా బయట నుంచి వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఊరంతా బ్లీచింగ్ చేయించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కేంద్ర బృందం ఆ గ్రామాన్ని సందర్శించనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

**పరిస్థితి అదుపులో ఉంది**



విరేచనాలు, వాంతులు అయినట్లు సమాచారం వచ్చిన వెంటనే గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తున్నాం. చనిపోయిన శివమ్మ ఇదివరకే మూత్ర పిండాల వ్యాధితో బాధపడటం క్రియాటిన్ ఎక్కువగా ఉండడం దీనికి తోడు విరేచనాలు, వాంతులు కావడంతో చనిపోవడానికి కారణమై ఉంటుందని భావిస్తున్నాం. మరో ఐదుగురు తిరుపతి , మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు కూడా కోలుకుంటున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉంది.

\-కె. శ్రీధర్, మండల వైద్యాధికారి, కురబలకోట మండలం

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో కదిరివారిపల్లె గ్రామం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బసెద్దుల హనుమంతు (38) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు టౌన్‌కు చెందిన హనుమంతు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనిమీద రాజంపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన ముద్దనూరుకు బైకులో పవన్ కుమార్ అనే మరో వ్యక్తితో కలిసి బయలుదేరాడు. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో కదిరివారిపల్లె గ్రామ క్రాస్ రోడ్డు వద్ద బైకు ఆపి నిల్చొని ఉన్నారు. ఆ సమయంలోనే గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో హనుమంతు, పవన్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందాడు, మృతుడికి భార్య చెన్నమ్మతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





## సత్యకుమార్‌కు మంత్రి పదవిపై హర్షం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు వాసి అయిన యాదవ్ సత్యకుమార్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కడం ఈ ప్రాంతానికి గర్వకారణమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన రాష్ట్ర మంత్రి కావడంతో ధర్మవరం నియోజకవర్గంతోపాటు ప్రొద్దుటూరు ప్రాంతం కూడా ఎంతో అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగినా లేక జనసేన నాయకుడా





ఫ్లెక్సీలోని ఫొటోలో ఎడమ వైపు నుంచి మొదటి వ్యక్తి శ్రీనివాసులరెడ్డి

సాక్షి, కడప : మండల కేంద్రమైన కలసపాడులోని 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెగ్యులర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న అట్లూరు మండలం తంబళ్లగొంది గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వ ఉద్యోగినా లేక జనసేన నాయకుడా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బుధవారం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్‌కళ్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా తన గ్రామమైన తంబళ్లగొంది పంచాయతీలోని లింగాలకుంట గ్రామంలో తన స్నేహితులతో కలిసి బ్యానర్ ఏర్పాటు చేశారు.

## సుబ్బారావు మరణాన్ని మాకు అంటగట్టడం న్యాయమా?



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ఆర్యవైశ్యుడైన ఎస్‌వీ సుబ్బారావు మరణాన్ని తమకు అంటగట్టడం ఏమాత్రం న్యాయం కాదని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా సుబ్బారావు తనకు మంచి మిత్రుడు అన్నారు. ఎన్నికల సందర్భంగా తమకు రూపాయి డబ్బు ఇచ్చినా, ఇప్పించినట్టు నిరూపించినా స్పాట్‌లోనే చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ పేర్లతో గత మే నెలలో అప్పుల బాండ్లు ఉంటే ఎవరైనా ఆర్యవైశ్య సభకు వెళ్లవచ్చన్నారు. దురుద్దేశంతో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఒక్క రూపాయి కూడా సుబ్బారావు ఎన్నికల సందర్భంగా తమకు ఇవ్వలేదన్నారు. గతంలో అతని బంధువుల వద్ద రూ.20 లక్షలు అప్పులు చేశాడని, ఎన్నికల ఫలితాల సందర్భంగా రూ.68 లక్షలు బెట్టింగ్ పెట్టాడన్నారు. బాకీలు చెల్లించేందుకు డబ్బు కోసం సుబ్బారావు ప్రయత్నించాడని, సమయానికి ఎవ్వరూ ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తన మరణం తర్వాత సమాచారం తెలిపేందుకు ఆప్త మిత్రులైన తనతోపాటు మరికొందరి పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లు సుబ్బారావు పేపర్‌లో రాశాడన్నారు. కొంత మంది ఈ విషయాన్ని చెప్పకుండా సూసైడ్ నోట్‌లో తమ పేర్లు రాశాడని చెప్పడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమపై బురదచల్లడం మానుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, చింపిరి అనిల్ కుమార్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, బీఎస్ఆర్ పాల్గొన్నారు.

# బడి ఎంపికలో.. భద్రం గురూ..

**మేడిపండు చూడ మేలిమై ఉండు..పొట్ట విప్పి చూడ పురుగులుండు' చందాన తయారైంది.. పాఠశాలల పరిస్థితి. ఆకర్షణీయ ప్రకటనలు, ఆకట్టుకునే పేర్లతో బోర్డులు చూసి తల్లిదండ్రులు మోసపోతున్నారు.. ఈ నెల 13వ తేదీన ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల ఎంపికలో జాగ్రత్తలు ఉండాలని విద్యావేత్తలు, విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు.**

- పిల్లల అడ్మిషన్లతో తస్మాత్ జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- రిజిస్ట్రేషన్, రికగ్నైజేషన్‌పై ఆరా తీయండి

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 13వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. అయితే విద్యార్థులను చేర్చే ముందు ఆయా పాఠశాలలకు అనుమతి ఉందో.. లేదో..తెలుసుకోవడం లేదు. విద్యాశాఖ నియంత్రణ కొరవడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండానే కొన్ని స్కూళ్లు ఆమోదం ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 773 ఉన్నాయి. వీటిలో సీబీఎస్సీ, స్టేట్ సిలబస్ ఉన్న ప్రాథమిక పాఠశాలలు 263, ప్రాథమికోన్నత పాఠశాలలు 186, ఉన్నత పాఠశాలలు 325 ఉన్నాయి. వీటన్నింటిలో 1,83,572 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

**అనుమతులు తప్పనిసరి**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే కచ్చితంగా ప్రాథమిక తరగతులకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఉన్నత తరగతులకు ఆర్జేడీల అనుమతి తీసుకోవాలి. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తోక పేర్లతో ప్రచారాలను సాగిస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు ఖచ్చితంగా విచారించాల్సి ఉంది.


**వీటిపై ఆరా తీయ్యండి**

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా రికగ్నైజేషన్ పొంది ఉండాలి. ఇది నిబంధన. చాలా విద్యా సంస్థల బోర్డులు, ప్రకటన నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్ అని ఉంటుంది. ఇక్కడ రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు. విద్యాశాఖ నుంచి రికగ్నైజేషన్ తీసుకోవడం తప్పనిసరి. ఇది వారికి ఉందా అని విచారించి అలాంటి విద్యా సంస్థలలోనే తమ తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరపున పరీక్ష రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థి గానే పరిగణిస్తుంది. మరిన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాల నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్ష రాయిస్తుంటారు. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితంగా విద్యాసంస్థ అనుమతి పత్రాలను అడిగి తెలుసుకోవాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలివి**

- ■ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి. ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన భవన నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- ■ మౌలిక వసతులు చూసుకోవాలి. బాత్‌రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు, విద్యార్థుల మానసికోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- ■ అర్హత గల ఉపాధ్యాయులు బోధిస్తున్నారా, లేదా పరిశీలించాలి. ప్రాథమిక, ప్రా థమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు, ఉన్నత పాఠశాలు అయితే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుడు ఉండాలి.
- ■ సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణా శాఖ జారీ చేసిన సామర్థ్య పరీక్ష పత్రాన్ని కలిగి ఉండాలి. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- ■ జీ-1 భవనాలుటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ■ చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**



ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థ ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలి. విద్యా ర్థులకు పాఠశాలల్లో అన్ని వసతులు ఉండాలి. లేకుంటే ఈ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. అదే విధంగా విద్యా సంస్థ పక్కా రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ రికగ్నైజేషన్ తప్పక పొంది ఉండాలి. తల్లిదండ్రులు ప్రైవేటు సంస్థల ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.

\- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి